సాక్షి ప్రకాశం

సోమవారం ၊ 16 ၊ డిసెంబర్ ၊ 2024



**పోటీ ఏదైనా.. పతకం కొట్టాల్సిందే..**
కొనకనమిట్ల మండలం గొట్లగట్టు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటుతున్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు గెలుచుకుంటున్నారు. - 8లో..



**అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు**
పలు చోరీ కేసుల్లో నిందితునిగా ఉన్న నెల్లూరు జిల్లా మాచవరం గ్రామానికి చెందిన అంతర్ రాష్ట్ర దొంగ కట్టా మధు బాబును పోలీసులు అరెస్టు చేశారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
29/21

**వాతావరణం**
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం .చలిగాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### నేటి నుంచి స్కూల్ లీడర్షిప్ ట్రైనింగ్

**ఒంగోలు సిటీ:** జిల్లాలోని స్కూల్ లీడర్షిప్ ట్రైనింగ్ ప్రోగ్రాంనకు కేటాయించిన ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు ఈ నెల 16 నుంచి 6 రోజుల పాటు ఒంగోలులోని శ్రీరామచంద్రమిషన్ లో జరిగే రెసిడెన్షియల్ శిక్షణకు హాజరు కావాలని డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. 1, 2 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు కె.ఆర్.పి లు, డి.ఆర్.పి లు 16వ తేదీ సోమవారం నుంచి చీరాలలో జరిగే ఎఫ్.ఎల్.ఎన్ ట్రైనింగ్ కు విధులు కేటాయించిన ఉపాధ్యాయులు కూడా హాజరు కావాలని తెలిపారు. విధులు కేటాయించిన వారి వివరాలు ఇప్పటికే మెయిల్, వాట్సప్ ద్వారా పంపించారన్నారు. సంబంధిత ఉపవిద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు విధులు కేటాయించిన వారిని వెంటనే రిలీవ్ చేయాలని ఆదేశించారు. సోమవారం ఉదయం 7 గంటలకు సంబంధిత కేంద్రాల్లో రిపోర్టు చేయాలన్నారు.

### నీటి సంఘాల ఎన్నికల్లో తాత్కాలిక ఉద్యోగి పోటీ



నీటి సంఘం ఉపాధ్యక్షుడిగా నియామక పత్రం అందుకుంటున్న శ్రీను నాయక్

**యర్రగొండపాలెం:** అధికారం మాది, మమ్మల్ని అడిగేవారు ఎవరున్నారని అనుకున్నారేమో శనివారం నిర్వహించిన నీటి వినియోగదారుల సంఘం ఎన్నికల్లో తాత్కాలిక ఉద్యోగి పోటీ చేసి ఉపాధ్యక్ష పదవిని తన సొంతం చేసుకున్నాడు. పుల్లలచెరువు మండలంలోని నరజాముల తండాకు చెందిన శ్రీను నాయక్ యర్రగొండపాలెం ఎస్టీ కళాశాల హాస్టల్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఈయన తన సొంత గ్రామమైన నరజాముల తండాలో జరిగిన నీటి సంఘల ఎన్నికల్లో పోటీ చేసి ఉపాధ్యక్ష పదవిని తన సొంతం చేసుకున్నాడు. ఆయన సోదరుడు వైపాలెంలోని వంద పడకల వైద్యశాలలో జనరల్ డ్యూటీ అటెండెంట్‌గా పనిచేస్తున్న శంకర్ నాయక్ ఈ ఎన్నికల్లో ప్రధాన పాత్ర పోషించడమే కాకుండా నియామక పత్రం అందించే కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు.

### ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ కార్యవర్గ ఎంపిక



ఏకగ్రీవంగా ఎంపికైన నూతన కార్యవర్గం

**ఒంగోలు సిటీ:** ఒంగోలు సమగ్రశిక్ష కార్యాలయంలో ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గ ఎన్నికలను ఆదివారం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఎస్.సురేష్, అబ్జర్వర్ గా రాజేంద్ర వ్యవహరించారు. నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎంపికైంది. అధ్యక్షులుగా వి.శివలీల, ప్రధాన కార్యదర్శిగా జి.సాయిచైతన్య, కోశాధికారిగా ఎస్.పేరయ్య లను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అసోసియేట్ అధ్యక్షునిగా పి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా ఈ.ఆదిలక్ష్మి, పి.నాగరాజు, జి.క్రిష్ణమోహన్, జి.పాండు రంగారావు, జి.సురేష్ లను నియమించారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.వి.రమణయ్య, సంయుక్త కార్యదర్శులుగా వెంకటేశ్వర్లు, విజేత, కళ్యాణి, వెంకటాద్రి, బాలక్రిష్ణ, మహిళా కార్యదర్శిగా బి.గౌరి లను ఎంపిక చేశారు. వీరు మూడు సంవత్సరాల కాలపరిమితి వరకు పదవిలో ఉంటారు. కార్యక్రమంలో రిటైర్డు అసిస్టెంట్ డైరెక్టర్లు రోశయ్య, రిటైర్డు సూపరింటెండెంట్ జేవీ ప్రసాద్, ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి. పద్మకుమారి, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎ.స్వాములు పాల్గొన్నారు.

రైతుల పంటల సాగుకు ఏదశలోనూ చేయూతనివ్వని కూటమి ప్రభుత్వం పంట దిగుబడులను అమ్ముకోవడంలోనూ వారికి మొండిచేయి చూపుతోంది. జిల్లాలో ప్రధానంగా సాగుచేసే పత్తి, మిర్చిని విక్రయించేందుకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు వ్యయ ప్రయాసలకోర్చి పక్కజిల్లాలకు వెళ్లాల్సి వస్తోంది. అంతదూరం వెళ్లలేనివారు దళారులకు అయినకాడికి తెగనమ్ముకుని నష్టపోతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జిల్లాలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోగా.. కూటమి ప్రభుత్వం వచ్చాక వాటి ఊసే పట్టించుకోలేదు.



మిర్చి గ్రేడింగ్ చేస్తున్న కూలీలు (ఫైల్)

# కొను ఘొల్లు

జిల్లాలో మిర్చి సాగు: 55,823 ఎకరాలు

పత్తి సాగు: 16,500 హెక్టార్లు

- కొనుగోలు కేంద్రాలు లేక మిర్చి, పత్తి రైతుల అగచాట్లు
- గుంటూరుకు తీసుకెళ్లి అమ్మకాలు
- సాగు పెట్టుబడులతో పాటు రవాణాభారం
- ఇంత వరకూ ప్రారంభంకాని సీసీఐ కొనుగోలు కేంద్రాలు
- దళారులకు అమ్మి నష్టపోతున్న రైతులు

**మార్కాపురం:**

జిల్లాలో రైతులు తెల్లబంగారంగా భావించే పత్తి, ఎర్రబంగారంగా భావించే మిర్చిని అత్యధిక విస్తీర్ణంలో సాగు చేశారు. అయితే ప్రభుత్వం ఇంత వరకూ పత్తి, మిర్చి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు తమ ఉత్పత్తులను గుంటూరు మార్కెట్‌యార్డుకు తీసుకెళ్లి విక్రయించాల్సి వస్తోంది. దీంతో ఆర్థికంగా కష్టనష్టాలకు గురవుతున్నారు. గత ప్రభుత్వంలో జిల్లాలోని మార్కాపురంతో పాటు వివిధ ప్రాంతాల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతోపాటు కనీస మద్దతు ధర ప్రకటించడంతో రైతులు తాము పండించిన పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకొచ్చి విక్రయించారు. అయితే డిసెంబరు 3వ వారం వచ్చినా పశ్చిమ ప్రకాశంలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. దీంతో పది మంది రైతులు ఒక లారీని బాడుగకు మాట్లాడుకుని అందులో పత్తిని నింపుకుని గుంటూరు మార్కెట్ యార్డుకు వెళ్లి విక్రయిస్తున్నారు. 2, 3 రోజుల పాటు యార్డులోనే ఉండాల్సి వస్తోంది. జిల్లా వ్యాప్తంగా 16,500 హెక్టార్లలో పత్తి సాగు చేపట్టారు. ఇందులో పశ్చిమ ప్రకాశంలో 8,840 హెక్టార్లలో సాగు చేశారు. ఎక్కువగా మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లో పత్తిసాగు ఎక్కువగా ఉంది. అయితే సీసీఐ కొనుగోలు కేంద్రం లేకపోవడంతో దళారులు క్వింటా రూ.6 వేల ప్రకారమే కొనుగోలు చేస్తున్నారు. వ్యయ ప్రయాసలకోర్చి గుంటూరుకు వెళ్లి అమ్మలేని రైతులు దళారులు చెప్పిన ధరకే విక్రయిస్తున్నారు. గత ప్రభుత్వం క్వింటా కనీస మద్దతు ధర రూ.7020 ప్రకటించింది. ప్రస్తుతం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు చిలకలూరిపేట, గుంటూరులలో ఏర్పాటు చేసినా అమలు చేస్తున్న నిబంధనలతో తక్కువ ధర మాత్రమే వస్తోంది. ఈ ఏడాది క్వింటా మద్దతు ధర రూ.7521 ఉన్నప్పటికీ దళారులు మాత్రం రూ.6 వేల నుంచి రూ.6300 మధ్య మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

**పశ్చిమ ప్రకాశంలో పత్తి సాగు**

| మండలం | సాగైంది హెక్టార్లలో |
|---|---|
| మార్కాపురం | 2500 |
| తర్లుపాడు | 60 |
| గిద్దలూరు | 123 |
| బేస్తవారిపేట | 267 |
| రాచర్ల | 684 |
| యర్రగొండపాలెం | 882 |
| పుల్లలచెరువు | 1446 |
| త్రిపురాంతకం | 171 |
| పెద్దారవీడు | 1079 |
| కంభం | 70 |
| దోర్నాల | 882 |
| అర్ధవీడు | 673 |



పత్తి బేళ్లు

**మార్కాపురంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి**

ప్రభుత్వం పశ్చిమ ప్రకాశం రైతుల కోసం మార్కాపురంలోనే మిర్చి, పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. దీనివలన రైతులకు ఆర్థికభారం తప్పడంతోపాటు పనిభారం కూడా తగ్గుతుంది. దళారులు చెప్పిన ధరకే ఇప్పుడు పత్తి, మిర్చి అమ్ముతున్నారు. ప్రభుత్వమే కొనుగోలుచేస్తే రైతులకు కనీస మద్దతు ధర లభిస్తుంది. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారులు చెప్పి ధరలకు, గుంటూరుకు వెళ్లి విక్రయిస్తున్నారు.

– జి బాలనాగయ్య, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

**దళారులకు అమ్మాల్సి వస్తోంది**



ఇంత వరకూ ప్రభుత్వం వైపు నుంచి పత్తి, మిర్చి కొనుగోలు కేంద్రాలు జిల్లాలో లేకపోవడంతో దళారులకు పత్తి, మిర్చి అమ్మాల్సి వస్తోంది. పత్తి నాలుగెకరాల్లో, మిర్చి నాలుగెకరాల్లో సాగు చేశాను. ఇటీవలే సుమారు 10 క్వింటాళ్ల పత్తిని కూడా అమ్మాను. మిర్చి కొనుగోలు కేంద్రం మార్కాపురం ప్రాంతంలో లేదు. గుంటూరుకు వెళ్లి అమ్మాలని అనుకుంటున్నాం. ఇక్కడే కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేస్తే మాకు ఉపయోగంగా ఉంటుంది.

– జానపాటి ఆవులయ్య, పత్తి, మిర్చి రైతు

**మిర్చి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి**



మార్కాపురంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో మిర్చి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. ఇప్పుడు మా రైతులు పండించిన మిర్చిని గుంటూరు వెళ్లి అమ్ముకోవడమో.. దళారులు చెప్పిన ధరలకు విక్రయించడమో జరుగుతోంది. దీని వలన నష్టపోతున్నాం. ఇక్కడే మిర్చి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే మాకు ఖర్చులు తగ్గుతాయి.

– టీ రామిరెడ్డి, రైతు

### మిర్చిరైతుల పరిస్థితి అదీ...

జిల్లాలో ఈ ఏడాది మిర్చి 55,823 ఎకరాల్లో సాగు చేశారు. ఇప్పుడిప్పుడే పండు మిర్చి మార్కెట్‌లోకి వస్తోంది. అయితే కొనుగోలు కేంద్రం లేకపోవడంతో గుంటూరు యార్డుకు రైతులు తీసుకెళ్లి అమ్ముతున్నారు. రాను.. పోను లారీ బాడుగ కింద సుమారు రూ.15 నుంచి రూ.20 వేల ఖర్చు వస్తుంది. మార్క్‌ఫెడ్ ద్వారా మిర్చిని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నా ప్రభుత్వం వైపు నుంచి స్పందన లేదు. ఎకరా మిర్చి సాగుకు సుమారు రూ.లక్ష నుంచి రూ.1.15 లక్షల వరకూ ఖర్చుపెట్టారు. ఎకరాకు 15 క్వింటాళ్ల దిగుబడులు రావచ్చని రైతులు భావిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా మిర్చి ధర రూ.16 వేలు ఉంది.

**జిల్లాలో మిర్చి సాగు ఇలా...**

| మండలం | ఖరీఫ్ సాగు (ఎకరాల్లో) |
|---|---|
| మార్కాపురం | 2657.52 |
| దోర్నాల | 5817.10 |
| పెద్దారవీడు | 4543.83 |
| వై పాలెం | 10409.49 |
| త్రిపురాంతకం | 5767.35 |
| పుల్లలచెరువు | 8098.75 |
| గిద్దలూరు | 893.33 |
| రాచర్ల | 1086 |
| కొమరోలు | 152.31 |
| బేస్తవారిపేట | 910.59 |
| కంభం | 342.23 |
| అర్ధవీడు | 2207.97 |
| తర్లుపాడు | 1520.42 |
| దొనకొండ | 1386.30 |
| కురిచేడు | 2078.14 |
| ముండ్లమూరు | 2552.10 |
| దర్శి | 1331.42 |
| కొనకనమిట్ల | 765.01 |
| పొదిలి | 641.69 |
| తాళ్లూరు | 259.02 |
| నాగులుప్పలపాడు | 510.21 |
| మద్దిపాడు | 14.81 |
| చీమకుర్తి | 88.23 |
| మర్రిపూడి | 676.82 |
| హనుమంతునిపాడు | 57.77 |
| వెలిగండ్ల | 186.81 |
| కనిగిరి | 471 |
| కొండపి | 85.51 |
| సంతనూతలపాడు | 134.97 |
| టంగుటూరు | 9.45 |
| పొన్నలూరు | 10.25 |
| పీసీపల్లి | 186.05 |
| సీఎస్‌పురం | 8.05 |
| పామూరు | 23.22 |



మిర్చి పంట

## పొట్టి శ్రీరాములు సేవలను తెలుగుజాతి మరువదు

- వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు



వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న చుండూరు రవిబాబు, నాయకులు

**ఒంగోలు సిటీ:** అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్రప్రదేశ్‌కు చేసిన కృషిని తెలుగుజాతి మరువదని ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు అన్నారు. ఒంగోలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు 72 వ వర్ధంతి నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి చుండూరు రవిబాబు, రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు కుప్పం ప్రసాద్, ఎస్సీ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు కుప్పం ప్రసాద్ మాట్లాడుతూ టీటీడీలో ఒక్క బోర్డు మెంబరు కానీ, కార్పొరేషన్ చైర్మన్ ను కూడా చంద్రబాబు ఇవ్వకుండా ఆర్యవైశ్యులను మోసం చేస్తున్నారని విమర్శించారు. కపట నాటకాలు ఆడి చంద్రబాబు దుర్మార్గమైన ఆలోచనలు చేసి ఆర్యవైశ్యులకు ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆర్యవైశ్యుల వ్యాపారాలు బాగున్నాయని, చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే వ్యాపారాలు నాశనం అయిపోయాయన్నారు. చంద్రబాబు తన పక్కన ఉన్న ఆ నలుగురికి దోచిపెట్టే పరిస్థితి ప్రస్తుతం ఉందన్నారు. ఆర్యవైశ్యులు అంతా గమనిస్తున్నారని, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఎన్నికల ముందు చెప్పిన వాగ్దానాలు అమలు చేయలేదని, రానున్న రోజుల్లో ఆర్యవైశ్యులు బుద్ధి చెబుతారని చెప్పారు.

ఎస్సీ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవం కాపాడటానికి 58 రోజులు పాటు నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అన్నారు. ఆర్యవైశ్యులకు ప్రాధాన్యత కల్పించిన వారు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని కొనియాడారు.

కార్యక్రమంలో ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, వైస్సార్‌సీపీ నాయకులు దామరాజు క్రాంతికుమార్, కె.ఆదెన్న, బొట్ల సుబ్బారావు, రొండా అంజిరెడ్డి, పెరకం సుబ్బారావు, పి.ఆంజనేయులు, విజయలక్ష్మి, రమణారెడ్డి, మీరావలి, నరాల రమణారెడ్డి, కరుణాకర్, శ్రీనివాసరెడ్డి, పిగిలి శ్రీనివాసరావు, వెంకటేశ్వరరెడ్డి పల్నాటి, హౌసింగ్‌బోర్డు చిన్న, కమ్మసురేష్, నాగుర్‌మీరా, కఠారి ప్రసాద్, పి.కోటేశ్వరరావు, ఇమ్రాన్, వెన్నపూస వెంకటరెడ్డి, రమణమ్మ, ముల్లంగి రవీంద్రరెడ్డి, కాశిరెడ్డి, కె.కోటి యాదవ్, కటారి సజీవ్, భాస్కర్, ఉదయగిరి కృష్ణ, పణిదపు సుధాకర్, సుబ్బారెడ్డి, బత్తుల ప్రమీల, జిలానీబాషా, రాజు నాగిరెడ్డి, జాజుల శ్రీను, పొటికాలపూడి రాము, డి.జయరామిరెడ్డి, గోనెల శివ కుమార్, గోనెల మేరికుమారి, మధుసుదనరెడ్డి, ఏడుకొండలు, ఆర్టీసీ వెంకటరావు, సురేష్ కుట్టుబోయిన, దేవరకొండ వాణి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ చార్జీల భారంపై గళమెత్తండి

- పార్టీ బలోపేతానికి పునాదులు వేద్దాం
- సీపీఎం జిల్లా మహాసభల్లో తీర్మానం
- జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక
- కార్యదర్శిగా ఎస్‌కే మాబు

**చీమకుర్తి:** ప్రజల భాగస్వామ్యంతో విద్యుత్ చార్జీల భారంపై ఆందోళనలు చేపడదామని సీపీఎం జిల్లా మహాసభల్లో తీర్మానించింది. మూడు రోజుల నుంచి చీమకుర్తిలో నిర్వహిస్తున్న సీపీఎం జిల్లా 14వ మహాసభల ముగింపు వేడుకలు ఆదివారంతో ముగిశాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ.శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి పునాదులు వేద్దామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి కృషి చేయాలని స్థానిక నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తి చేసి త్వరగా జిల్లా ప్రజలకు నీరిచ్చేలా పోరాటాలు సాగించాలన్నారు. అనంతరం పార్టీ జిల్లా నాయకత్వం ప్రవేశపెట్టిన తీర్మానాలను ఆమోదించారు.

**26 మందితో జిల్లా నూతన కమిటీ ఎన్నిక:**
మూడో రోజు సీపీఎం ముగింపు వేడుకల అనంతరం కార్యదర్శి, కార్యదర్శివర్గ సభ్యులతో కలిపి మొత్తం 26 మందితో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శిగా షేక్ మాబు, కార్యదర్శివర్గ సభ్యులుగా సయ్యద్ హనీఫ్, పోనాటి ఆంజనేయులు, జీవీ కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, ఎం.రమేష్, డీ.సోమయ్యను ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ సభ్యులుగా ఊసా వెంకటేశ్వర్లు, కంకణాల రమాదేవి, ఎల్లంపల్లి ఆంజనేయులు, కాలం సుబ్బారావు, బీ.రఘురామ్, పీ.కల్పన, రంగారావు, జీ.రమేష్, పూసపాటి వెంకట్రావు, పీసీ కేశవరావు, కే.మాల్యాద్రి, బంకా సుబ్బారావు, మస్తాన్, జయంత్‌బాబు, రఫీ, ఆదిలక్ష్మి, బాలకోటయ్య, బాలనాగయ్యలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, కారుసాల సుబ్బరావమ్మ, ఉమామహేశ్వరరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



సీపీఎం జిల్లా నూతన కార్యవర్గం

## గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్

**ఒంగోలు వన్‌టౌన్:** గిరిజనుల సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ అన్నారు. ఒంగోలు వచ్చిన ఆయన స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం గిరిజనులు, గిరిజన సంఘాల నాయకులతో సమావేశానికి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంగోలులోని మున్సిపల్ వాణిజ్య సముదాయాల్లో గిరిజనులకు హక్కుల మేరకు దుకాణాలను కేటాయించాలన్నారు. గిరిజన సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామని చెప్పారు. ఒంగోలు నగరంలో 2008 సంవత్సరంలో కొత్తపట్నం సమీపంలో 55 మందికి పైగా కుటుంబాల నక్కల వారికి పట్టాలు ఇచ్చారన్నారు. వారు గుడిసెలు ఏర్పాటు చేసుకున్నారన్నారు. అయితే ఈ మధ్య వచ్చిన వర్షాల వలన గుడిసెలు కొట్టుకుపోయాయన్నారు. తిరిగి ఒంగోలు వచ్చి కూరగాయల మార్కెట్ వద్ద చిన్న, చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నారని చెప్పారు. కలెక్టర్ స్పందించి వీరికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలన్నారు. కొత్తపట్నం తీర ప్రాంతంలో వేలాది మంది గిరిజనులు చేపలు పట్టుకుంటూ జీవిస్తున్నారని, అయితే ఇంటి పెద్దకు ఏదైనా ప్రమాదం సంభవిస్తే రోడ్డున పడుతున్నారన్నారు. మత్స్యశాఖ వారు చేపలు పట్టుకుంటూ జీవిస్తున్న గిరిజనులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని సూచించారు. ఇటువంటి వారికి వలలు, ఆటోలు, మార్కెట్ వసతులు, ప్రభుత్వం కల్పించే వాటిన్నంటిని గిరిజనులకు కూడా కల్పించాలన్నారు. ఒంగోలు నగరంలోని గిరిజన కాలనీలలో వసతులు కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి, డాక్టర్ బాలాజీ నాయక్ పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్

## సత్తాచాటిన గుంటూరు జిల్లా ఎడ్లు

**పెద్దారవీడు:** మండలంలోని దేవరాజుగట్టులో వెలసిన కాశినాయన 29వ ఆరాధన మహోత్సవం సందర్భంగా ఆదివారం తెలుగు రాష్ట్రాల స్థాయి పెద్దసైజు బండలాగు పందేలు పోటాపోటీగా జరిగాయి. గుంటూరు జిల్లా కుంచనపల్లి గ్రామానికి చెందిన పీఆర్ మెమోరియల్ ప్రలగం ప్రతిజ్ఞరెడ్డి, జస్విత్‌రెడ్డి ఎడ్లజత 1845 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలవగా వారికి కృష్ణా జిల్లా మైలవరం గ్రామానికి చెందిన శ్రీలం హరీష్‌రెడ్డి, ఐలూరి మురళీకృష్ణారెడ్డి నగదు బహుమతి రూ.60,116 అందజేశారు. బాపట్ల జిల్లా బల్లికురవ గ్రామానికి చెందిన వీరస్వామిచౌదరి ఎడ్లజత 1800 అడుగులు లాగి ద్వితీయ స్థానంలో నిలవగా, వారికి మార్కాపురం పట్టణానికి చెందిన దగ్గుల శ్రీనివాసరెడ్డి, దరిమడుగు గ్రామానికి చెందిన ముదిరెడ్డి శ్రీనివాసరెడ్డి రూ.50,116 అందించారు. నంద్యాల జిల్లా కుంపరమానుదిన్నె గ్రామానికి చెందిన కుందురు రాంభూపాల్‌రెడ్డి ఎడ్లజత 1640 అడుగులు లాగి తృతీయ స్థానం సాధించగా, వారికి బోడపాడు గ్రామానికి చెందిన బొగ్గు శేఖరరెడ్డి, మార్కాపురం పట్టణానికి చెందిన వేంపాటి రామకృష్ణారెడ్డి రూ.40,116 ఇచ్చారు. నంద్యాల జిల్లా జిల్లెలగోస్పాడు గ్రామానికి చెందిన గారటికె నాగిరెడ్డి ఎడ్లజత 1626 అడుగులు లాగి చతుర్థ స్థానంలో నిలవగా మార్కాపురం పట్టణానికి చెందిన గొలమారి శ్రీనివాసరెడ్డి, గుంటక పాపిరెడ్డిలు రూ.30,116 బహూకరించారు. మార్కాపురం మండలం బొడిచర్ల గ్రామానికి చెందిన తిండి నక్షత్రరెడ్డి ఎడ్ల జతలు 1620 అడుగులు, 1092 అడుగులు లాగి పంచమ, షష్ఠమ స్థానంలో నిలిచాయి.

మార్కాపురంలో లోచన్ కంటి, దంత వైద్యశాల డాక్టర్ ఫణీంద్రారెడ్డి, డాక్టర్ శ్వేత పంచమ బహుమతి రూ.20,116, నికరంపల్లి గ్రామానికి చెందిన బొరిగొర్ల గంగయ్య షష్ఠమ బహుమతి రూ.10,116 నగదును విజేతలకు అందజేశారు. ఎడ్ల పందేలను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భారీగా ప్రజలు, రైతులు తరలి వచ్చారు.



దేవరాజుగట్టులో పోటీ పడుతున్న ఎడ్లజత

## క్లుప్తంగా

### కంభం సీఐ ఫోన్ హ్యాక్

**కంభం:** కంభం సీఐ ఫోన్, వాట్సాప్ హ్యాక్ అయినట్లు ఎస్సై నరసింహారావు తెలిపారు. సీఐ వాట్సాప్ నుంచి వచ్చిన మెసేజీలను ఎవ్వరూ ఓపెన్ చేయవద్దని, పొరపాటున ఓపెన్ చేస్తే మీ ఫోన్‌లోని డేటా, బ్యాంక్ ఖాతాల్లోని నగదు పోయే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని కోరారు.

### గంజాయి సాగు కలకలం



స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్క

**మార్కాపురం:** తర్లుపాడు మండలంలోని జగన్నాథపురంలో ఒక వ్యక్తి ఇంట్లోని పెరట్లో సాగవుతున్న గంజాయి మొక్కలను ఆదివారం పోలీసులు గుర్తించారు. దీనితో ఆ వ్యక్తి నివాసానికి వెళ్లి సాగవుతున్న రెండు గంజాయి మొక్కలను పీకి స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన మండలంలో చర్చనీయాంశమైంది. ఎస్సై బ్రహ్మనాయుడు సిబ్బందితో వచ్చి విచారణ చేపట్టారు.

### కోడిపందేల స్థావరాలపై పోలీసులు దాడి

**తాళ్లూరు:** మండలంలోని నాగంబొట్లవారిపాలెంలో కోడి పందేల స్థావరంపై ఆదివారం పోలీసులు దాడులు చేశారు. వివరాల్లోకి వెళితే..గ్రామంలో కోడి పందేలు నిర్వహిస్తున్నరన్న సమాచారం మేరకు ఎస్సై మల్లికార్జునరావు సిబ్బందితో దాడి చేశారు. దాడిలో 10 మంది జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి ఐదు కోళ్లు, రూ.16 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జూదరులను సోమవారం దర్శి జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరుపరుస్తామన్నారు.
**పామూరు:** మండలంలోని చిలకపాడు పొలాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్సై టి.కిషోర్‌రెడ్డి తెలిపారు. వారి వద్ద నుంచి 3 కోళ్లు, రూ.3,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



జూడో పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

**ఒంగోలు:** రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహించే క్రీడాకారుల ఎంపిక స్థానిక మామిడిపాలెంలోని పట్టణ అభివృద్ధి కేంద్రం ఆధ్వర్యంలోని యోగ సెంటర్‌లో నిర్వహించారు. పోటీల్లో సుమారు 60 మంది క్రీడాకారులు పాల్గొనగా వారికి వివిధ కేటగిరీల్లో పోటీలు నిర్వహించారు. పోటీల పరిశీలనకు రాష్ట్ర జూడో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ షేక్ ఖాజామస్తాన్ హాజరయ్యారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఆదికేశవ, యువరాజ్, మోక్షజ్ఞ, భానుచంద్ర, జిలానీ, తేజ, కరిముల్లా, కీర్తి, సయ్యద్‌ర, సాజియ తబస్సుమ్‌లు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 21, 22 తేదీల్లో విజయవాడలో జరిగే సీనియర్స్ రాష్ట్ర జూడో పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని పోటీలను నిర్వహించిన జూడో జిల్లా కార్యదర్శి ఎ.రవి, టెక్నికల్ కమిటీ మెంబర్లు షేక్ హిమాంషు, సంతోష్‌కుమార్‌లు పేర్కొన్నారు.

### ఎస్‌బీఐ ఏటీఎం ధ్వంసం

- సకాలంలో పోలీసులు రావడంతో పరారైన నిందితుడు



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

**కొండపి:** ఏటీఎంను గుర్తు తెలియని దుండగుడు ధ్వంసం చేసిన ఘటన ఆదివారం తెల్లవారుజామున జరిగింది. ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..పొదిలి రోడ్డులోని స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ వద్ద ఉన్న ఏటీఎంను దుండగుడు ఆదివారం తెల్లవారుజామున ఒకటిన్నర ప్రాంతంలో ధ్వంసం చేయడానికి ప్రయత్నించాడు. ఏటీఎంలో సీసీ కెమెరాలో కనిపించకుండా నల్ల స్టిక్కర్ అంటించాడు. అయితే సీసీ కెమెరాలు లైవ్ రికార్డింగ్ ఉండటంతో హైదరాబాద్ మెయిన్ బ్రాంచ్ నుంచి కొండపి బ్యాంకు మేనేజర్‌కు సమాచారం అందించారు. దీంతో బ్యాంకు మేనేజర్ పోలీసులకు సమాచారం ఇచ్చి వారితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులను గమనించిన దుండగుడు అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులు పట్టుకునేందుకు ప్రయత్నించగా తప్పించుకొని వెళ్లాడు. బ్యాంకు మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దర్యాప్తులో భాగంగా క్లూస్‌టీం వేలిముద్రలు సేకరించారు.



కబడ్డీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు



క్రీడాకారులతో వ్యాయామం చేయిస్తున్న పీడీ



రగ్బీలో అవార్డు పొందిన లక్ష్మీ కల్పన

# పోటీ ఏదైనా.. పతకం కొట్టాల్సిందే..!

గొట్లగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా పతకాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. పోటీ ఏదైనా పాఠశాల క్రీడాకారులు సత్తా చాటుతూ పతకాలు కొల్లగొట్టేస్తున్నారు. పాఠశాలకు చెందిన 50 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి, 10 మంది క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికై పాఠశాలకు మంచిపేరు తీసుకువచ్చారు.

- క్రీడల్లో గొట్లగట్టు పాఠశాల విద్యార్థుల సత్తా
- కబడ్డీ, హ్యాండ్ బాల్, రెజ్లింగ్, రగ్బీ, సెపక్‌తక్రా, అథ్లెటిక్స్‌లో పతకాల పంట
- జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఎంపిక





రగ్బీలో పతకాలు సాధించిన క్రీడాకారులు



కబడ్డీలో అవార్డు పొందిన చిరుత

**కొనకనమిట్ల:**

చదువే కాదు..క్రీడల్లోనూ మండలంలోని గొట్లగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటుతున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటుతూ తామేంటో నిరూపిస్తూ ముందుకు సాగుతున్నారు. పాఠశాల హెచ్‌ఎం, పీడీ, ఉపాధ్యాయుల క్రీడాకారులకు మంచి ప్రోత్సాహం అందిస్తుండటంతో ఏ పోటీలకు వెళ్లినా పతకంతో బయటకు వస్తున్నారు. చదువుతో పాటు పాఠశాల పీడీ వై.బాలగురవయ్య ఇచ్చే తర్ఫీదులో కబడ్డీ, హ్యాండ్‌బాల్, రగ్బీ, రెజ్లింగ్, సెపక్‌తక్రా, అథ్లెటిక్స్ పోటీల్లో రాణిస్తూ ఎన్నో పతకాలు సాధించారు. పోటీల్లో బాలురే కాదు...బాలికలు సత్తా చాటుతూ తామేం తక్కువ కాదని నిరూపించారు.

**నిరంతర సాధన..**

గొట్లగట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పీడీగా పనిచేస్తున్న వై.బాలగురవయ్య ఒకప్పుడూ పాఠశాల పూర్వ విద్యార్థి. పాఠశాలలో కొంత మంది క్రీడాకారులను ఎంపిక చేసుకొని వారికి ఆటల పోటీల్లో మెళకువలు నేర్పించి క్రీడలపై అవగాహన కల్పించారు. వారిలో పెండెం నరహరి, మొలకా చిరుత, దుర్భాకుల ఉమాశంకర్, వెన్నా విష్ణువర్ధన్‌రెడ్డి, కోలా ఆకాష్, వరప్రసాద్, దుర్గాప్రసాద్, వెంకటయ్య, నవీన్, యువరాజు, దీప్తి, ఆర్.లక్ష్మీకల్పన, వి.మహేశ్వరి, చంద్రలిఖిత, గురులక్ష్మి, జస్సీలు పలు క్రీడా పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం ఇవ్వడంతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అక్కడ కూడా సత్తా చాటి అవార్డులు దక్కించుకున్నారు.

**రెజ్లింగ్‌లో తిరుగులేదు..**

పాఠశాలకు చెందిన పలువురు క్రీడాకారులు శారీరక దృఢత్వం కలిగిన రెజ్లింగ్‌ను ఇష్టపడి నేర్చుకున్నారు. వారి ఉత్సాహాన్ని చూసిన పాఠశాల పీడీ బాలగురవయ్య ఆదే ఉత్సాహంతో క్రీడాకారులకు శిక్షణ ఇచ్చారు. రెజ్లింగ్‌లో నిత్య సాధనతో పతకాల పంట పండిస్తున్నారు. కష్టమైనా రెజ్లింగ్‌లో సత్తా చాటుతూ రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తున్నారు. ఇటీవల విజయవాడ, ఒంగోలు, కావలి, ఏలూరు, కమలాపురం, కర్నూలు, బాపట్ల, తెనాలి, ఉత్తరప్రదేశ్, ఛత్తీష్‌ఘడ్ నిర్వహించిన రాష్ట్ర, జాతీయ స్థాయి రెజ్లింగ్, కబడ్డీ, రగ్బీ, రెజ్లింగ్, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొన్న పాఠశాల క్రీడాకారులు విష్ణువర్ధన్‌రెడ్డి, ఉమాశంకర్, నవీన్, యువరాజు, వెంకటయ్య, వరప్రసాద్, దుర్గాప్రసాద్ ప్రతిభ కనబరిచారు. వారిలో విష్ణువర్ధన్‌రెడ్డి బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కాగా వరప్రసాద్ బ్రాంజ్ మెడల్ సాధించాడు.

**కబడ్డీలో సత్తా..**

పాఠశాలకు చెందిన క్రీడాకారులు దుర్భాకుల ఉమాశంకర్, పెండెం నరహరి, మొలకా చిరుత, కోలా ఆకాష్, బాలికల విభాగంలో లక్ష్మీకల్పన, మహేశ్వరి, దీప్తిలు కబడ్డీ పోటీల్లో తమ సత్తా చాటి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై అవార్డులు దక్కించుకున్నారు. అలాగే రగ్బీ, సెపక్‌తక్రా, హ్యాండ్‌బాల్ పోటీల్లోనూ మంచి ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు.

**పాఠశాలకు మంచిపేరు తెచ్చారు:**

మూడేళ్లలో మా పాఠశాల విద్యార్థులు ఆటల పోటీల్లో మంచి ప్రతిభ కనబరుస్తున్నారు. ముఖ్యంగా రెజ్లింగ్, కబడ్డీ, హ్యాండ్‌బాల్, రగ్బీ, సెపక్‌తక్రా అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై అక్కడ కూడా రాణించి అవార్డులు సాధించటం సంతోషంగా ఉంది. పోటీల్లో క్రీడాకారులకు మంచి తర్ఫీదు ఇచ్చి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడానికి పాఠశాల పీడీ బాలగురవయ్య చాలా కృషి చేశారు.

విజయలక్ష్మి, హెచ్‌ఎం

# అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్టు

- రూ.6 లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- పగటి పూట చోరీ చేయడమే నిందితుని నైపుణ్యం
- విలేకరుల సమావేశంలో వెల్లడించిన సీఐ హజరత్తయ్య



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ హజరత్తయ్య

**సింగరాయకొండ:** పలు చోరీ కేసుల్లో నిందితునిగా ఉన్న పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా మాచవరం గ్రామానికి చెందిన అంతర్‌రాష్ట్ర దొంగ కట్టా మధుబాబునును ఆదివారం కందుకూరు ఫ్లైఓవర్ వద్ద అదుపులోనికి తీసుకున్నట్లు సీఐ సీహెచ్ హజరత్తయ్య తెలిపారు. నిందితుని నుంచి రూ.6 లక్షల విలువైన బంగారు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచామన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చెడు వ్యసనాలకు బానిసైన మధుబాబు కొంతకాలంగా చోరీలకు పాల్పడుతున్నాడన్నారు. ఆచూకీ దొరక్కుండా ఉదయం పూట చోరీ చేయడం ఇతని ప్రత్యేకతని, తక్కువ సమయంలోనే చోరీ చేసి సంఘటనా స్థలం నుంచి పరారయ్యేవాడని చెప్పారు.

నిందితుడు మధుబాబు తెలంగాణ రాష్ట్రంలోని సూర్యాపేటతో పాటు పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని కందుకూరు, కందుకూరు రూరల్, గుడ్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన పలు చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడన్నారు. ఈ క్రమంలో ఈ నెల 2వ తేదీ సుందర్‌నగరికి చెందిన కుంచాల సునీత సుబ్బారెడ్డి ఫ్యాక్టరీలో పని నిమిత్తం ఇంటికి తాళం వేసి వెళ్లారు. సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటికి వచ్చిన సునీత కుమారుడు బీరువా పగల కొట్టి ఉండటాన్ని గమనించి చోరీ జరిగిందని నిర్ధారించుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీఐ హజరత్తయ్య, ఎస్సై బి.మహేంద్రలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో నిందితుడిని ఆదివారం కందుకూరు ఫ్లైఓవర్ దగ్గర అదుపులోకి తీసుకుని చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసును చాకచక్యంగా ఛేదించిన సీఐ హజరత్తయ్య, ఎస్సై మహేంద్ర, ఏఎస్సై షేక్ మహబూబ్ బాషా, సీహెచ్ శేషారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ తిరుపతిస్వామి, కానిస్టేబుల్ సుమన్‌లను ప్రత్యేకంగా అభినందించినట్లు వివరించారు.

## పొట్టి శ్రీరాములు ఒక ఉద్యమ స్ఫూర్తి

- ఎస్పీ ఏఆర్ దామోదర్



అమరజీవి పొట్టిశ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

**ఒంగోలు టౌన్:** రాష్ట్రం సాధనకు తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు ఒక నిరంతర స్ఫూర్తిగా నిలిచారని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. ఎస్పీతో పాటు పోలీసు అధికారులు మహానేతకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేయడం అంటే మాములు విషయం కాదన్నారు. గాంధీ మార్గంలో నడిచి అనేక ఉద్యమాల్లో క్రియాశీల పాత్ర పోషించారని కొనియాడారు. ఆయన త్యాగం నేటి తరానికి గొప్ప ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఏఆర్ డీఎస్పీ కె. శ్రీనివాసరావు, ఆర్ఐ సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఉక్కు మనిషి సర్దార్ ...**

స్వాతంత్ర్యానంతరం విప్లవాత్మక చర్యలు చేపట్టడం ద్వారా ఉక్కుమనిషిగా సర్దార్ వల్లభభాయ్ పటేల్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని ఎస్పీ ఏఆర్ దామోదర్ కొనియాడారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన సర్దార్ వర్ధంతిలో నివాళులర్పించారు. దేశ సమగ్రత కోసం పాటు పడిన సర్దార్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

# సబ్‌జూనియర్ ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక



ఆర్చరీ పోటీలలో పాల్గొంటున్న చిన్నారులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన చిన్నారులు

**ఒంగోలు:** సబ్ జూనియర్ జిల్లా స్థాయి ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక ఆదివారం స్థానిక ఏబీఎం డిగ్రీ కాలేజీ గ్రౌండులో నిర్వహించారు. ఈ ఎంపిక పోటీలను ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, కార్యదర్శి బొడ్డు సుబ్బారావు, ఎస్.చంద్రశేఖర్ పరిశీలించారు. ఇండియన్ రౌండ్, రికర్వ్ రౌండు, కాంపౌండ్ రౌండులలో పోటీలు నిర్వహించారు. ఎంపికైన వీరు ఈనెల 23 నుంచి 25 వరకు రాజమండ్రిలోని ఫ్యూచర్ కిడ్స్ ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని ఆర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ రామకృష్ణారావు, పి.లెమ్యూల్‌రాజు తెలిపారు.

**ఇండియన్ రౌండు బాలుర విజేతలు:**
కె.గోవర్ధన్, కె.బెంజిమన్, కె.వెంకట సురేష్, కె.జస్వంత్, కె.రక్షన్, బి.నాగకౌశిక్

**ఇండియన్ రౌండు బాలికల విజేతలు:**
పి.శ్రీతన్వి, సీహెచ్ సుశాన్, కె.శ్రావ్య, కె.స్నేహలత

**రికర్వ్ రౌండ్ బాలుర విజేతలు:**
ఆర్.యజ్ఞ శ్రీనాథ్, ఎం.కృష్ణన్, జె.కార్తి లక్ష్మీరామ్, తనిక్

**రికర్వ్ రౌండు బాలికల విజేతలు:**
కె.అభిలాష్, కె.గీతాంజలి, వంశీక

**కాంపౌండ్ రౌండు బాలికల విజేతలు:**
డి.భవ్యశ్రీ, డి.దివ్య

## ఆస్టర్ రమేష్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు

- మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆస్టర్ రమేష్ ఎండీ డాక్టర్ పోతినేని రమేష్

**ఒంగోలు టౌన్:** జిల్లాలోని నిరుపేద, మధ్య తరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకొని ఆస్టర్ రమేష్ ఆస్పత్రిలో త్వరలోనే ఆరోగ్యశ్రీ(ఎన్‌టీఆర్ వైద్యసేవ) వైద్య సేవలను ప్రారంభించనున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు తెలిపారు. 36వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఆస్టర్ రమేష్ ఆసుపత్రిలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 800 మందికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకు వస్తామని చెప్పారు. అలాగే చిన్న పిల్లలకు గుండె చికిత్సలు, గుండె బైపాస్, కవాట మార్పిడి శస్త్ర చికిత్సలతో పాటు ఆధునిక గుండె ఎలక్ట్రో ఫిజియాలజీ సేవలను కూడా ఒంగోలు ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు. మారుమూల గిరిజనులకు అత్యవసర వైద్య సేవలను అందించేందుకు గాను ప్రభుత్వ వైద్యశాలలో టెలీ ఐసీయూ సేవలను ప్రారంభించనున్నట్లు వివరించారు. ఐసీయూలో ఉన్న క్రిటికల్ కేర్ రోగులను విజయవాడలోని కమాండ్ కంట్రోలు సెంటర్ ద్వారా నిపుణుల పరిశీలనలో ఉంచేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. 5జీ అంబులెన్స్ ద్వారా రోగి తరలింపు సమయంలో రియల్‌టైం మానిటరింగ్ చేసి మరణాల రేటును తగ్గించే ఆధునిక సౌకర్యాలను కల్పించనున్నట్లు చెప్పారు. వైద్య రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకనుగుణంగా డ్రోన్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌లను కూడా ఉపయోగిస్తామన్నారు. ప్రస్తుతం ఒంగోలు ఆస్పత్రిలో ఉన్న 200 పడకల సామర్థ్యాన్ని పెంచి అదనంగా మరో 100 పడకలను అందుబాటులోకి తెచ్చేందుకు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో యూనిట్ హెడ్ డాక్టర్ నల్లూరి నితిన్, మెడికల్ సూపరెండెంట్ డాక్టర్ వంశీ, స్ట్రాటజీ హెడ్ డాక్టర్ కళ్యాణ్, గ్రూప్ బిజినెస్ హెడ్ డాక్టర్ కార్తీక్ చౌదరి పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములు పోరాటం స్ఫూర్తిదాయకం



కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి, కలెక్టర్

**ఒంగోలు వన్‌టౌన్:** పొట్టి శ్రీరాములు ఆత్మార్పణతోనే ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటైందని, ఆయన పోరాటం స్ఫూర్తిదాయకమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలాశ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన ఆత్మార్పణ దినం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముందుగా ఒంగోలు సీవీఎన్ రీడింగ్ రూం వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి మంత్రి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, ఇతర అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలుగు వారికి ప్రత్యేక గుర్తింపు ఉండాలన్న పొట్టి శ్రీరాములు ఆశయ సాధన దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ కలెక్టరేట్ ప్రాంగణంలో పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ బీ చిన ఓబులేశు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి అంజల, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర రావు, డీఈఓ కిరణ్ కుమార్, స్టెప్ సీఈఓ శ్రీమన్నారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి, ఆర్డీఓ లక్ష్మి ప్రసన్న, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వరరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.